క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ



శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకు వస్తున్న అర్చకులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

రోగులకు కళ్లద్దాల పంపిణీ



రోగికి కళ్లద్దాలు అందజేస్తున్న గంగరాజు

ఆనందపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించిన రోగులకు శుక్రవారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. కుసులువాడ సచివాలయం పరిధిలోని ముకుందపురం పంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ కలిమి గంగరాజు నలుగురు రోగులకు ప్రభుత్వం మంజూరు చేసిన కళ్లద్దాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన బేసిక్ సర్జికల్ స్కిల్స్ వర్క్‌షాప్



వర్క్‌షాపులో పాల్గొన్న వైద్య విద్యార్థులు

తగరపువలస: సంగివలస ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన బేసిక్ సర్జికల్ స్కిల్స్ వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. ట్రైనీ డాక్టర్లు, విభిన్న శస్త్ర చికిత్సా విభాగాలలో మొదటి సంవత్సరం పీజీ విద్యార్థులు 200 మంది ఇందులో పాల్గొన్నారు. ప్రతీ విద్యార్థికి వివిధ కుట్లు పద్ధతులు, నమూనాలు, మెలకువలతో పాటు అభ్యసన అనుభవాన్ని వివరించారు. ఇలాంటి వృత్తిపరమైన అభ్యసన అనుభవం వైద్యులకు దోహదపడుతుందని వైద్యనిపుణులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డీన్ పీవీ సుధాకర్, అనస్థీషియా వైద్యులు కె.రంజిత్ మనోహర్, బి.ఎస్.వి. సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చక్కటి నడవడిక కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేష్

పద్మనాభం : విద్యార్థులు చక్కటి నడవడిక కలిగి ఉండాలని, నేరాలు చేయకూడదని నార్త్ సబ్ డివిజన్ క్రైమ్ సీఐ కె.సురేష్ అన్నారు. పద్మనాభం గోస్తని పీఎస్ లో గురువారం రాత్రి విద్యార్థులకు క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే నేరాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్ నాశనమవుతుందన్నారు. నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని తెలిపారు. సెల్ ఫోన్లలో విద్యకు అవసరమైన వాటిని మాత్రమే చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి

- పుట్టలకు పోటెత్తిన భక్తులు
- నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు

తగరపువలస: నాగులచవితిని భీమిలి పరిధిలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉపాధి నిమిత్తం దూరప్రాంతాలకు వెళ్లినవారు సైతం తమ గ్రామాలకు చేరుకుని రోడ్లవెంట, తోటలు, వ్యవసాయభూముల్లోని పుట్టల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాగేంద్రునికి పువ్వులు, పాలు, పండ్లు, వస్త్రాలు, కోడిగుడ్లు, నువ్వు పప్పు బెల్లంతో చేసిన చిమిడి వంటివి సమర్పించారు. బాణసంచా వెలిగించారు. తమను, పిల్లా పాపలను కంటికి రెప్పలా కాపాడాలని పుట్టమన్నుతో బొట్టు పెట్టుకుని వేడుకున్నారు. చవితి సందర్భంగా రోడ్లన్నీ భక్తులతో సందడిగా కనిపించాయి. ముఖ్యంగా చిట్టివలస ఈఎస్‌ఐ ప్రాంగణం, ఎల్లారమ్మ మెట్ట, సంగివలస పోలమాంబ ఆలయం, గోస్తని నది తీర ప్రాంతం, నమ్మివానిపేట, చిట్టివలస పోలమ్మ ఆలయం, గోస్తని నది వంతెన అప్రోచ్ రోడ్డు, గల్లీరోడ్డు, బొగ్గురోడ్డు, సుఖీభవ కాలనీలు, చిట్టివలస జ్యూట్‌మిల్లు పరిసరాలు భక్తుల రాకపోకలతో కిక్కిరిసిపోయాయి. పండగ సందర్భంగా ఈ ప్రాంతంలో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి.



చిట్టివలస మామిడితోటలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

మధురవాడ: నాగుల చవితి పర్వదినాన్ని మధురవాడలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు భక్తి శ్రద్ధలతో శుక్రవారం జరుపుకున్నారు. నగర శివారు, కొండవాలు ప్రాంతాలలో పుట్టలు వెదుక్కుని పాలు పోసి, పూజలు చేశారు. రెవెన్యూ లే అవుట్, ఆర్‌టీసీ కాలనీ, మారికవలస, కొమ్మాది, రేవళ్లపాలెం, పరదేశిపాలెం తదితర ప్రాంతాలలో పుట్టల్లో పాలు పోయడానికి భక్తులు బారులు తీరారు.

భీమిలిలో..

భీమునిపట్నం: భీమిలి ప్రాంతంలో శుక్రవారం నాగుల చవితి ఘనంగా జరిగింది. బీచ్‌రోడ్డు, తగరపువలస రోడ్డు ప్రాంతాల్లో ఉన్న పుట్టల వద్దకు ఉదయం ఆరు గంటల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు చేసి, బాణసంచా కాల్చారు.



భీమిలిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

కొమ్మాది: నాగులచవితిని గుడ్లవానిపాలెం, సాగర్ నగర్, ఎండాడ, రుషికొండ, తిమ్మాపురం, మంగమారిపేట, నగరపాలెం, కాపులుప్పాడ, జేవీ అగ్రహారం, నిడిగట్టు, కొమ్మాది, మారికవలస, బోరవానిపాలెం ప్రాంతాల్లో భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. పుట్టలో గుడ్లు, పాలు పోసి నాగేంద్రుడికి పూజలు చేశారు.

ఆనందపురం : మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నాగులచవితిని ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లో గల పుట్టల వద్దకు వెళ్లి పువ్వులు, పసుపు, కుంకుమలతో అందంగా అలంకరించారు. పాలు, గుడ్లు పండ్లు, సిమ్మిడిని నాగదేవతకు నైవేద్యంగా సమర్పించారు. బాణసంచా కాల్చి సందడి చేశారు. దీంతో పొలాలన్నీ కోలాహలంగా మారాయి.



కుసులువాడ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

పద్మనాభం: నాగుల చవితి సందర్భంగా భక్తులు పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రునికి పాలు పోసి పూజలు చేశారు. మద్దిలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు పుట్ట వద్ద పూజలు చేశారు.

పీఎం పాలెం: శిల్పారామంలో ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన పుట్టలను పూజించుకోడానికి స్థానిక ఏవో విశ్వనాథరెడ్డి అనుమతించడంతో స్థానికులు సంప్రదాయబద్ధంగా పండగను జరుపుకొన్నారు.



ఎండాడలో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఎమ్మెల్యే ముత్తంశెట్టికి స్వామీజీ ఆశీస్సులు



విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహా స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా చినముషిడివాడ పీఠంలో స్వామీజీని దర్శించుకుని, ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తారాజువ్వ పడి కోళ్లఫారం దగ్ధం



దగ్ధమైన కోళ్ల ఫారం పాక

ఆనందపురం : మండలంలోని చందకలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో కోళ్ల ఫారం దగ్ధమైంది. సమీపంలో నాగుల చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్న వారు కాల్చిన తారాజువ్వ పడి కమ్మల పాక పూర్తిగా కాలిపోయింది. ఈ సంఘటనను గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయగా వెంటనే వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. లేదంటే పెద్ద ప్రమాదం సంభవించేది. నష్టాన్ని బాధితుల వద్ద నుంచి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సేకరించి నమోదు చేశారు.

పేదల సంక్షేమం కోసం జగనే కావాలి

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- యల్లపువానిపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్

గోపాలపట్నం: పేదల సంక్షేమం కోసం మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెంలో శుక్రవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా 466 సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ముత్తంశెట్టి ఆవిష్కరించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఆంధ్రదేశ్‌కు జగన్ మోహన్ రెడ్డి ఎందుకు కావాలన్న అంశాలను వివరించారు. ఇక్కడి సచివాలయం పరిధిలో రూ.15.94 కోట్లు సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేశామన్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు రూ.4 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కులం, మతం, పార్టీ చూడకుండా లబ్ధిచేకూర్చి చరిత్ర సృష్టించారని చెప్పారు.



యల్లపువానిపాలెం 466 సచివాలయంలో పథకాల బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

చెంతకే సంక్షేమం

సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ప్రభుత్వాని ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. బడుగు, బలహీన వర్గాలు క్షేమంగా ఉండాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు..

యల్లపువానిపాలెంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి వైఎస్సార్ నగర్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య ఉందని స్థానికులు ముత్తంశెట్టి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందించి సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అయితంశెట్టి గోపాలకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి ఆళ్ల పైడిరాజు, ఏపీడీ శ్రీరామ్, అధికారులు పాల్గొన్నారు.

నిందితునికి 3 నెలల జైలు శిక్ష

పీఎం పాలెం: చోరీ కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. 2022లో మారికవలసలోని ఓ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి బంగారు పుస్తెల తాడు అపహరించాడు. అప్పటి ఎస్‌ఐ ఆర్.శ్రీనివాసరావు బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా తోట వీరబాబు(28) ఈ చోరీ చేశాడని తేలింది. విచారించగా నేరం రుజువవడంతో భీమిలి 16వ ఏఎంఎం కోర్టు జడ్జి సీహెచ్ పవన్ కుమార్ నిందితుడికి మూడు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఏపీపీగా కె.కమల్ రాథోడ్ వ్యవహరించారు.

19న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

పీఎం పాలెం: స్థానిక శ్రీ శృంగేరీ శంకర మఠంలో ఈ నెల 19వ తేదీన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నామని మఠం గౌరవ ధర్మాధికారి జె. వెంకటేశ్వర్లు తెలిపారు. పీఎం పాలెం ఆఖరు బస్టాపు నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులోని మఠంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని ఆయన కోరారు.

శబరిగిరికి సైకిళ్లపై స్వాముల పయనం

తగరపువలస : స్థానిక శ్రీశబరిగిరి మణిరంత పీఠానికి చెందిన నలుగురు స్వాములు శుక్రవారం సాయంత్రం సైకిళ్లపై శబరిమలైలోని అయ్యప్ప స్వామి సన్నిదానానికి బయలుదేరి వెళ్లారు. గురుస్వామి గుడ్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో చుక్క నరసింగరావు, దుర్రి గురువులురెడ్డి, కొయ్య శ్యాంప్రసాద్ సంతపేట కొత్తమ్మతల్లి ఆలయం నుంచి ఈ యాత్ర ప్రారంభించారు. అంతకు ముందు పూజా కార్యక్రమాలు నిర్వహించిన గురుస్వామి దామోదర తవుడుబాబు జెండా ఊపి ఈ యాత్రను ప్రారంభించారు. 13 రోజుల్లో 1600 కిలోమీటర్ల మేర యాత్ర పూర్తి చేసి డిసెంబరు ఒకటిన సన్నిధానానికి చేరుకోనున్నట్టు నరసింహారెడ్డి తెలిపారు. వీరికి వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి, గురుస్వాములు కుమిలి తిరుపతిరావు, బోని ఈశ్వరరావు, నమ్మి భాస్కర్, కొయ్య శ్రీనివాసరెడ్డి తదితరులు వీడ్కోలు పలికి సంగివలస కొత్తమ్మతల్లి ఆలయం వరకు వెళ్లారు.



సంతపేట కొత్తమ్మతల్లి ఆలయం నుంచి శబరిమలైకు బయలుదేరిన స్వాములు

19 నుంచి బాబా జయంతి వేడుకలు

తగరపువలస : భగవాన్ సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్టు చిట్టివలస సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. మొదటిరోజు ఓంకారం, సుప్రభాతం అనంతరం మహిళా దినోత్సవం నిర్వహించి మహిళలకు చీరల పంపిణీ, గర్భిణులకు సేవా కార్యక్రమాలతో ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 20న సేవాదళ్ దినోత్సవం సందర్భంగా వృద్ధులకు దుప్పట్ల పంపిణీ, 21న యుజవన దినోత్సవం సందర్భంగా ప్రమాదాల నివారణకు వాహనాలకు స్టిక్కర్లు అంటించి అవగాహన, 22న బాలవికాస్, 23న సత్యసాయి వ్రతాలు, నగర సంకీర్తన, క్షీరాభిషేకం, పల్లకీ ఉత్సవం, అన్నసమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

తైక్వాండోలో అనిల్ నీరుకొండ విద్యార్థినికి కాంస్య పతకం

తగరపువలస : ఈ నెల 6 నుంచి 9 వరకు రాజస్థాన్‌లో సౌత్ వెస్ట్ ఇంటర్ విశ్వవిద్యాలయాల పరిధిలో జరిగిన తైక్వాండో మహిళల చాంపియన్‌షిప్‌లో సంగివలస అనిల్ నీరుకొండ డెంటల్ కళాశాల విద్యార్థిని ఎల్.టి.భువనేశ్వరి కాంస్య పతకం గెలుచుకుంది. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ తరఫున ఆమె ఈ పోటీల్లో పాల్గొంది. ఈ సందర్భంగా శుక్రవారం డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, ప్రిన్సిపాల్ వంశీకృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి ఆమెను అభినందించారు.



భువనేశ్వరిని అభినందిస్తున్న డీన్ డాక్టర్ సుధాకర్

కొనసాగుతున్న గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

కొమ్మాది : స్వాతంత్య్ర పోరాటంలో గిరిజనుల కృషిని స్మరించుకోవడానికి, వారి సాంస్కృతిక వారసత్వాన్ని రక్షించుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనజాతీయ గౌరవ దివస్ – గిరిజన స్వాభిమాన ఉత్సవాలు మూడవ రోజు రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణా మిషన్ భవన్‌లో ఘనంగా కొనసాగాయి. దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి. జోగినాయుడు పాల్గొని ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలో జరిగిన గిరిజన స్వాతంత్య్ర పోరాటం గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ జోగి నాయుడు

రెండిళ్లలో చోరీ

ఇద్దరు బాలురను విచారిస్తున్న క్రైం పోలీసులు

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం పంచాయతీ మచ్చవానిపాలెంలో శుక్రవారం చోరీ జరిగింది. ఈ మేరకు ఇద్దరు బాలురిని స్థానిక క్రైమ్ పోలీసులు విచారిస్తున్నారు. మచ్చవానిపాలెంలో రెండు ఇళ్లల్లో నగదు చోరీకి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు విచారణ జరుగుతోంది. చోరీకి పాల్పడింది మండలంలోని పాలవలసకు చెందిన ఇద్దరు బాలురిగా పోలీసులు గుర్తించి విచారిస్తున్నారు. వారు ఆనందపురం ఉన్నత పాఠశాలలో చదువుతున్నట్టు కనుగొన్నారు. కాగా వారికి పాత స్నేహితుడు సహకరించినట్టు తెలుస్తోంది. దీంతో పోలీసులు అన్ని కోణాల్లోను పూర్తి స్థాయి విచారణ జరుపుతున్నారు. ఏ ఇళ్లల్లో ఎంతెంత నగదు చోరీకి గురైంది అన్న విషయం తెలియవలసి ఉంది.

తునివలస సచివాలయం ఆకస్మిక తనిఖీ

పంచాయతీ కార్యదర్శికి మెమో

పద్మనాభం: మండలంలోని తునివలస సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలో హాజరు పట్టీలు, లీవ్, తీర్మానం, మూవ్‌మెంటు రిజిస్టర్లు, క్యాష్ బుక్ పరిశీలించారు. హాజరు పట్టీలో ఈ నెల 16,17 తేదీల్లో సంతకాలు పెట్టకపోవడం, మూవ్‌మెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడం, ఈ ఏడాది మే 31వ తేదీ నుంచి నవంబర్ 17వ తేదీ వరకు సర్వీస్ అమౌంట్ క్యాష్ బుక్‌లో నమోదు చేయకపోవడంతో పంచాయతీ కార్యదర్శి బి.వి.రవికి మెమో జారీ చేసినట్లు ఎంపీడీవో విజయ్ కుమార్ తెలిపారు.



తునివలస సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో విజయ్ కుమార్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు



పోటీలో పాల్గొన్న విద్యార్థులు

భీమునిపట్నం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ఆవశ్యకతపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ మైలిపల్లి లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను చదివే అలవాటు చేసుకోవాలన్నారు. సెయింట్ ఆన్స్ పీఈటీ రాజు, గ్రంథాలయ అధికారి మహేష్ పాల్గొన్నారు.

ఆనందపురం గ్రంథాలయంలో..

ఆనందపురం : ఆనందపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మత్తు పదార్థాలు–బాలలపై వాటి ప్రభావం, పుస్తక పఠనం వలన కలిగే లాభాలు అనే అంశాలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రాచీన కవులు–ఆధునిక కవుల వృత్తాంతాలను వివరిస్తూ వారి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు గ్రంథాలయాన్ని సందర్శించి ప్రదర్శనలో ఉంచిన పుస్తకాలను పరిశీలించి పాఠకులుగా తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ బీవీఎస్ అప్పారావు, ఉపాధ్యాయులు ముత్యాల నాయుడు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీల ప్రభుపాదుల తిరోభావ దినోత్సవం



ప్రభుపాదుల విగ్రహానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

కొమ్మాది: హరేకృష్ణ మూవ్‌మెంట్ అంతర్జాతీయ వ్యవస్థాపకుడు శ్రీల ప్రభుపాదుల 46వ తిరోభావదినోత్సవాన్ని రుషికొండలోని ఓ రిసార్ట్‌లో శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి వివిధ ఫల రసాలు, పంచామృతాలు, సప్తనదీ జలాలతో అభిషేకం చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అష్టలక్ష్మి దేవాలయాన్ని సందర్శించిన గరికిపాటి

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయాన్ని ఆధ్యాత్మికవేత్త గరికిపాటి నరసింహారావు శుక్రవారం సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధర స్వామి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలోని వైశాఖేశ్వరస్వామి, ఆంజనేయస్వామి దర్శనం అనంతరం అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో అష్టలక్ష్ములను ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణం చేపట్టడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్తీకమాసంలో అమ్మవార్లను దర్శించుకోవడం అదృష్టం అన్నారు. ఆలయ ధర్మకర్తలు సత్యనారాయణమూర్తి, రమాదేవి దంపతులు, అర్చకులు దత్తస్వామి, రమేష్‌స్వామి, ప్రసన్న స్వామి పాల్గొన్నారు.



గరికిపాటికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

రాష్ట్రస్థాయి పోటీలకు గుడిలోవ విద్యార్థులు

ఆనందపురం: రాష్ట్ర స్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యార్థులు ఎంపికైనట్టు జిల్లా హ్యాండ్‌బాల్ సొసైటీ కార్యదర్శి ఎస్.గోపీకృష్ణ తెలిపారు. ఈ నెల 14న నగరంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొన్న వెంకట సాయిలక్ష్మి, ఆరాధ్యసింగ్, దియాసీతా మహతో, నికిత, మోక్షరత్నశ్రీ, విద్యాధరి, ఆకాంక్ష కాశ్యప్‌లు ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. ఈ మేరకు వారు ఈ నెల 18, 19 తేదీల్లో ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది సత్కరించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

వాహనం దగ్ధం

కొమ్మాది: వైఎల్‌పీ లే అవుట్‌లో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నొడగల వెంకటేశ్‌కు చెందిన టాటా ఏస్ వాహనానికి నిప్పు అంటించారు. దీంతో ఆ వాహనం పూర్తిగా దగ్ధమైంది. శుక్రవారం ఉదయం ఇది చూసి ఆందోళనకు గురయ్యారు. వారం రోజుల క్రితం గుడ్లవానిపాలెంలో ఓ వ్యక్తి కారుకు నిప్పు అంటించిన సంగతి తెలిసిందే. దీంతో రాత్రి సమయాల్లో పోలీసులు గస్తీని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు నవోదయ స్కూలు సమీపంలోని కాలనీలో శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవాలు శని, ఆదివారాలలో జరిపించనున్నట్లు నిర్వాహకుడు పిళ్లా రేవతిరావు తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి అధివాస, మండపారాధన, షోడశోపచార, అగ్నిహోత్ర ప్రతిష్ఠ, హోమాలు ఉంటాయన్నారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి సహస్ర ఘటాభిషేకం, కళాన్యాసం, హోమం అనంతరం ఉదయం 9.41 గంటలకు శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి మరియు నందీశ్వర స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు మధురవాడ మారుతీ విప్ర సేవా సమితి సహకారంతో అర్చకులు రాజేటి గురునాథ రామశర్మ ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో అన్న సమారాధన ఉంటుందని, భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

అనాథాశ్రమానికి నిత్యావసర సరకుల వితరణ



ఆశ్రమం విద్యార్థులతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

తగరపువలస : ఆనందపురంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రైమరీ విద్యార్థులు శుక్రవారం భీమిలి మండలం తాళ్లవలసలోని భరోసా లిటిల్ హగ్స్ అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులకు రూ.10 వేల విలువైన నిత్యావసర సరకులు అందించారు. విద్యార్థుల ప్రాజెక్ట్‌లో భాగంగా అనార్థులను ఆదుకోవడానికి గైడ్ చేసినట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా అనాథాశ్రమం నిర్వాహకులు అత్తాడ అవినాష్, వెంపాడ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులో పెద్ద మనసు చాటుకున్న విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు.